ఆదర్శపాఠశాల ఏఎంవో ఆకస్మిక సందర్శన

విశాలాంధ్ర - రణస్థలం : రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల అకాడమిక్ మోనటరింగ్ అధికారి కె. ధర్మకుమార్ స్థానిక రణస్థలం కొందములగాం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలకు ఉదయం ప్రార్థన సమయంలో సంద ర్శించి పిల్లల్ని అందర్ని ఉద్దేశిస్తూ వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలను మరియు ఎస్ఏ-2 పరీక్షలకు సన్నద్ధం కోసం తగిన సూచనలు చేయడం జరిగింది 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి నిన్న జరిగిన తెలుగు మరియు జరగబోవు పరీక్షల కోసం చర్చించడం జరిగింది. పాఠశాలలో అకాడమీకి సంబంధించిన రికార్డులు అన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శ్రీధర్, సిబ్బంది వున్నారు.

విద్యుత్ మీటర్ రీడర్స్ కుటుంబాలను ఆదుకోండి

ఏఐటీయూసీ నాయకులు చాపర వేణుగోపాల్

విశాలాంధ్ర - పలాస : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తుండంతో ఆ ప్రభావం వలన సుమా రా ఐదువేల కుటుంబాలు రోడ్డున పడబోతున్నారని వారిని ఆదుకోవాలని ఏఐటీయూసీ పలాస డివిజన్ నాయకులు చాపర వేణుగోపాల్, జిల్లా మీటర్ రీడర్స్ అధ్యక్షులు ఆర్.కుమారస్వామిలు అన్నారు. మంగళవారం విద్యుత్ మీటర్ల రీడర్స్ లతో పలాస విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖను నమ్ముకొని గత 15 నుండి 20 సంవత్సరాలుగా విద్యుత్ మీటర్ బిల్లులు తీస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు అయోమయ పరిస్థితుల్లో ఉన్నారని, ప్రస్తుతం ఉన్న ఐఆర్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్ల బిగిస్తున్న నేపథ్యంలో వారు జీవనోపాధి కోల్పోతున్నారని మీటర్ రీడర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. విద్యుత్ శాఖకు ఆర్థిక వనరులుగా ఉన్న తమని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం శాఖా పరంగా తీసుకొంటున్న నిర్ణయాలను తాము గౌరవిస్తామని అలాగే వారి జీవనోపాధిని దృష్టిలో పెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వలన మీటర్ల రీడర్స్ ఉద్యోగ భృతిని కోల్పోతున్నారని, చాలీ చాలని జీతాలతో విద్యుత్ శాఖని నమ్ముకొని జీవిస్తున్న వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. కరోనా వ్యాధి విజృంభిస్తున్న విపత్కర పరిస్థితుల్లో కూడా ఇంటింటికి వెళ్లి బిల్లులు ఇచ్చిన మీటర్ల రీడర్లను ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేసారు. రీడింగ్ తీసే సమయాన్ని దశల వారీగా కుదిస్తూ వచ్చిన యజమాన్యం వారిని వదల్లేదని, ప్రస్తుతం 1 నుండి 12 వ తేదీకి బిల్లులు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయాన్ని కూడా స్వాగతించి కష్టపడుతున్నారని వారు స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఆరోగ్యం బాగోక పోయినా, కుటుంబంలో శుభకార్యం, అశుభ కార్యం జరిగిన బిల్లులు తీయాల్సిన పరిస్థితుల్లో ఉన్నారని బిల్ రీడర్లు వాపోతున్నట్లు తమ దృష్టికి తీసుకొచ్చారని దీని వలన ఆర్థిక స్తోమత లేక మానసికంగా చాలా కష్టపడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేసారు. ఈ క్రమంలో మీటర్ రీడర్లకు విద్యుత్ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, ఎప్కో ఎకౌంటు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. అనంతరం విద్యుత్ మీటర్ల రీడర్స్ న్యాయమైన డిమాండ్లను సాధించు కోవడానికి పలాస విద్యుత్ శాఖ డిఈకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మీటర్ రీడర్స్ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి దూగాన. భాస్కర రావు, పలాస డివిజన్ అధ్యక్షులు బి.ఓంకార్, పలాస డివిజన్ కార్యదర్శి కే నరేష్, సోంపేట, పలాస సబ్ డివిజన్ మీటర్ రీడర్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

జీడి మామిడి తోట వేలంపాట ఖరారు

విశాలాంధ్ర - పోలాకి : మండల పరిషత్ కార్యాలయంలో కోడూరు జీడి మామిడి తోట పలసాయమునకు 1,45,500 రూపాయలకు వేలం పాట ఖరారైనట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు ఆధ్వర్యంలో జీడి మామిడి తోట వేలం పాట ప్రారంభించారు. ఈ మేరకు సర్కార్ పాట 1,32,400 పాట ప్రకటించగా అందులో కరుకోల రమేష్ బాబు 1,45,500 కు పాట పాడి కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సూర్య ప్రకాష్ గొర్లె యర్రయ్య శాలిని గణేష్ మోహన్ రావు కె డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 18, 19 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణా కార్య క్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా వస్తున్న సాంకేతికతను అలవర్చుకొని నైపుణ్యాభివృద్ధి చేసుకోవాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా కార్యాలయాలకు ఉపయోగపడే ఆర్టిఫిషియల్ ఇంటి లిన్స్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఎక్సెల్ షీట్స్, తదితర వాటిపై కంప్యూటర్ లో శిక్షణ తీసుకొని సాంకేతికత నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు.

ఆపద కాలంలో మహిళకు రక్షణ..'శక్తి' యాప్

శక్తి టీం ఎస్ఐ బాలకృష్ణ

విశాలాంధ్ర - నరసన్నపేట : ఆపద కాలంలో మహిళలకు రక్షణగా శక్తి యాప్ ఉపయోగ పడుతుందని శక్తి టీం, ఎస్.ఐ, వి.బాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా ఎస్.ఐ, బాలకృష్ణ మాట్లా డుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ శక్తి యాప్‌లో తప్పిపోయిన పిల్లల వివరాలు, అక్రమ కార్య కలాపాలపై ఫిర్యాదు చేయటం, రాత్రి వేళల్లో భద్ర తతో కూడిన ప్రయాణం, పోలీసు అధికారుల వివ రాలు పొందు పరచారన్నారు. అత్యవసర పరిస్థి తుల్లో మహి ళలు, యువత దీనిని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇంఛార్జ్, ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు, లక్కోజు గౌరీశంకర్, రమణ, కానిస్టేబుళ్ళు, ప్రసాద్, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు స్వాధీనం

విశాలాంధ్ర - సంతబమ్మాలి : కోటబొమ్మాలి మండలం నారాయణవలస గ్రామ సమీపం నుంచి లారీలో 27 ఆవులను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం పోలీసులు మాటువేసి వాటిని పట్టుకున్నారు. అలాగే జాతీయరహదారి జర్జంగి సమీపంలో అక్రమంగా తర లిస్తున్న 7 అవులను సిబ్బందితో కలిసి పట్టుకు న్నామని ఏఎస్ఐ శంకరరావు తెలిపారు. రెండుచోట్ల పట్టుకున్న 34 ఆవులను సింహాచలం గోశాలకు తరలించి, ఆవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర - టెక్కలి : విద్యుత్తు మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని మంగళవారం ఆందోళన చేపట్టారు. మండలంలో స్థానిక అంబేద్కర్ కూడలి నుండి టెక్కలి విద్యాశాఖ డివిజన్ కార్యాలయం వరకు ఏఐటీయూసీ నాయకులు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఐటీయూసీ అధ్యక్షులు రవి మాట్లాడుతూ కొన్ని సంవత్స రాలుగా విద్యుత్ మీటర్ రీడర్స్ గా విధులు నిర్వహిస్తున్న కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డున పడేసిందని వాపోయారు. స్మార్ట్ మీటర్లు ద్వారా ఎవరికి ఉపయోగం అని ప్రశ్నించారు. తక్షణమే స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలన్నారు. విద్యుత్ మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హత ప్రకారం విధుల్లోకి తీసుకోవాలని కోరారు. డివిజన్లో,సబ్ డివిజనల్లో చెట్లు కోత తదితర డిపార్ట్మెంట్లో తమను నియమించుకోవాలని కోరారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న మేటర్ రీడర్లకు ఉపాధి కల్పించాలని, కనీస వేతనం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎకౌంటు ద్వారా వేతనాలు ఇవ్వాలని, మాకు న్యాయం కావాలని నినాదాలతో డిమాండు చేశారు. ఈ నిరసనలో ఉపాధ్యక్షులు శ్రీను, రాము, కిరణ్, సాయి, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్, మద్యానికి యువత దూరంగా ఉండాలి

బాలల హక్కుల పరిరక్షన కమిషన్ చైర్మన్ కె.అప్పారావు

విశాలాంధ్ర - పలాస : సెల్ ఫోన్లకు, మద్యంకు యువత దూరంగా ఉండాలని, ప్రస్తుత పరిస్థితులలో యువత ప్రమాదపు అంచుల్లో ఉన్నారని బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ చైర్మన్ కె.అపారావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పలాస మున్సిపల్ కార్యాలయంలో మహిళా పోలీసు లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు పలాస కాశీబుగ్గ జంట పట్టణాలలోని జీడి పరిశ్రమలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై కాకుండా ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరికి ఉందన్నారు. పిల్లలను పాఠశాలకు పంపించే క్రమంలో విద్యార్థుల బాధ్యతను ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు వహించాలన్నారు. పాఠశాలల వరకు మత్తు పదార్థాలు రవాణా అవుతున్నాయని, వాటిని అరికట్టేందుకు మహిళా పోలీసులు కీలక పాత్ర పోషించాలన్నారు. విద్యార్థులు చెడు స్నేహాలు చేయకుండా ఆడపిల్లల భద్రతపై పాఠశాలు, కళాశాలల్లో, అవగాహన సదస్సులు నిర్వహించా లన్నారు. 6వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులు చెడు వ్యసనాలతో పాటు లైగింక వేధింపులు గురికావడానికి ప్రదాన కారణం సెల్ ఫోన్, మత్తు పదార్థాలేనని స్పష్టం చేశారు. పసిపిల్ల నుంచి పండుటాకుల వరకు లైంగిక దాడులు జరుగుతున్నాయంటే అందుకు కారణం మద్యం, మత్తు పదార్థాలే కారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలు, వసతి గృహాల వద్ద ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేయాలని, వాటిని ప్రతీ 15 రోజులకు ఒకసారి తెరిచి సమస్యలను పరిష్కరించాలన్నారు. పాఠశాలల్లో గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించాలన్నారు. పాఠశాలలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించడంతో పాటు బాల కార్మికులను గుర్తించి, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే బాధ్యత మహిళా పోలీసులు తీసుకోవాలన్నారు. బాల కార్మికుల చట్టాలను ప్రతిష్టాత్మకంగా అమలు అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎన్.రామారావు, జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ, కాశీబుగ్గ సిఐ వి.సూర్యనారాయణ, సహాయ కార్మిక శాఖ అధికారి ఎన్.విజయకుమార్, ఐసిడిఎస్ పిఓ పార్వతి, సూపర్ వైజర్ యు.లత, ఎం.మల్లేశ్వరరావు, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో ఆర్డినేటర్ కె.శివాజీ, జిల్లా పరిశ్రమల శాఖ సీనియర్ సహాయకులు ఆర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సారా వద్దు.. ఆరోగ్యమే ముద్దు

ప్రతిజ్ఞ చేసిన అధికారయంత్రాంగం

విశాలాంధ్ర - సోంపేట : సమజానికి పెనుభూతంగా మారిన నాటుసారా నివారణకు అధికారులు ప్రతినబూనారు. నాటుసారా జాడ లేకుండా చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. నవోదయం 2లో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నవోదయం సమావేశానికి పలువురు అధికారులు హాజరయ్యారు. తహశీల్దార్ బి.అప్పలస్వామి,సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.మంగరాజు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.బేబీ, ఎంపీడీఓ ఈశ్వరమ్మ తదితరులు హాజరై నాటుసారా నిర్మూలన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తూ ఈ సమాజానికి హాని కలిగించే నాటుసారాను తన బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకం, కలిగి ఉండడం, సేవించడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఆరోగ్యానికి ప్రమాదకరమైన నాటుసారా ఎవరు కలిగియున్నా విక్రయించినా చట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నాటుసారా రహిత సమాజ నిర్మాణమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. ఎస్సై లోవరాజు, పంచాయతీరాజ్ కార్యదర్శులు, విఆర్వోలు పాల్గొన్నారు.

రక్షిత అటవీ ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం.. అదుపులోకి రాని మంటలు...!

విశాలాంధ్ర - మందస : మండలం చీపీ గిరిజన పంచాయతీ పరిధి రక్షిత అటవీ ప్రాంతంలో మంగళ వారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించడంతో కొండలు ప్రాంతంలో ఉన్న అటవీ సంపద బూడిద అవుతోంది. గిరిజన ప్రాంతంలోని రహదారులన్నీ పొగలతో అల్లుకు పోయాయి. అటవీ ప్రాంతంలో చీపి గ్రామానికి హెరాన్నాలి కొండకు మధ్యన వున్న సుమారు కోట్లాది రూపాయల విలువ చేసే టేకు ప్లాంటేషన్ కూడా అగ్ని ప్రమాదంలో చిక్కుకుంది. ప్రభుత్వ అటవీ ప్రాంతంలో అంతా పొగ కమ్ము కుంది. పరిసర ప్రాంతాల్లో గిరిజనులకు చెందిన జీడి తోటలకు కూడా నిప్పు అంటుకుంది. ఉదయం నుంచి ప్రారంభమైన మంటలు అదుపు కాకపోవడం తో మందస నుంచి అగ్నిమాపక వాహనంతో సిబ్బంది వెళ్లి మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నప్పటికీ మంటలు అదుపు లోకి రావడం లేదు. ఈ ప్రమాదంతో విద్యుత్ శాఖ అధికారులు వెంటనే ఆ ప్రాంతానికి సంబంధించిన విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు.దీంతో ఎగిసి పడుతున్న మంటలు ఓ పక్క ఇంకో పక్క ఎండల తీవ్రతతో గిరిజనులు అల్లాడి పోతున్నారు. దీంతో పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన గూడెంల లోని గిరిజనులు సమీప గ్రామాల పరిధిలోనీ దూర ప్రాంతాలకు వెళ్లి పోతున్నారు. అటవీ శాఖ ప్రాంతంలో మంటలు అదుపు చేయలేక పోవడంతో గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీసీ కమిషన్‌కు ఎమ్మెల్సీ నర్తు విన్నపం

విశాలాంధ్ర - సోంపేట : ఉత్తరాంధ్రలో ప్రధాన సామాజికవర్గమైన యాద వులను బిసి.డి నుంచి బిసి.బిలో చేర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు మంగళవారం విజయవాడలోని బిసి కమిషన్ కార్యాలయంలో కమిషనర్ శంకర్‌నారాయణను కలసి వినతిపత్రం అందజేశారు. అనేక దశా బ్దాలుగా వెనుకబాటుకు గురౌతూ సరైన విద్య సామాజిక అభివృద్ధి లేక వృత్తిపైనే ఆధారపడి యాదవ సామాజికవర్గం ఇప్పటికీ ఎంతో వెనుకబడి ఉందని పేర్కొన్నారు. ఇటువంటి సామాజిక వర్గానికి చేయూతనిచ్చే విధంగా తగు చర్యలు తీసుకుంటూ కనీసం బీసీ బిలోనైనా చేర్పించి వివిధ రంగాల్లో రిజర్వేషన్లు ద్వారా సామాజిక ఉన్నతికి దోహదపడాలని కోరారు. ప్రపంచం ఎంతో అభివృద్ధి చెందినా యాదవుల బతుకులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ యాద వులు తమ వృత్తిని నమ్ముకుని ప్రతిరోజు తెల్లవారే సరికి పాలు, పెరుగు, మజ్జిగ అమ్ముకుంటూ అదే జీవనాధారంగా బ్రతుకుతున్నారని గుర్తు చేశారు.

ఎన్.టి.ఆర్ నగర్‌లో త్వరితగతిన ఇళ్ళు నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర - నరసన్నపేట : మండలంలోని జమ్ము పంచాయితీ పరిధిలో ఉన్న రావాడపేట, గడ్డయ్యపేట గ్రామాల ఆవరణలో ఎన్.టి.ఆర్ కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కాలనీల్లో సంబంధిత లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ళు నిర్మాణాలు చేపట్టాలని నియోజకవర్గ సోషల్ మీడియా ఇంఛార్జ్, బగ్గు అర్చన అన్నారు. మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నేటి వరకూ గృహాలు నిర్మించుకోని లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.50వేలు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ విషయమై మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు మాట్లాడుతూ ఎన్.టి.ఆర్ నగర్‌లో సుమారు 1035ఇళ్ళ స్థలాలు లబ్ధిదారులకు మంజూరు చేశారని, దీనిలో 447మంది లబ్ధిదారులు ఇళ్ళు నిర్మాణం పూర్తి చేశారన్నారు. 459మంది లబ్ధిదారులు ఇళ్ళు నిర్మాణం చేస్తున్నారని, మిగిలిన 159మంది లబ్ధిదారులు నేటి వరకూ ఇళ్ళ నిర్మాణం చేపట్టలేదని, ఇంఛార్జ్, అర్చనకు వివరించారు. నేటి నుండి ఇళ్ళు నిర్మాణం చేసుకున్న వారందరికి ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు మంజూరు చేసిన రూ.50వేలు అందచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఏ.ఈ, ఉరిటి రాజేంద్రప్రసాద్, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆస్థి తగాదాలో మహిళపై దాడి...అపస్మారక స్థితిలో బాధితురాలు

విశాలాంధ్ర - సంతబొమ్మాలి : సంతబొమ్మాలి మండలము మలగాం పంచాయతీ దేపల్లివానిపేటలో ఆస్తి విషయమై తగాదా జరగడంతో మహిళపై దాడి చేయడంతో అపస్మారస్థితిలోకి వెళ్ళిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం తన తల్లి ఎరుపల్లి కామమ్మ ఆధీనంలో ఉన్న ఆస్తిని ఆమె మరణానంతం గ్రామానికి చెందిన ఎరుపల్లి లక్ష్మణరావు, అతని బంధువులు దౌర్జన్యంగా కబ్జా చేయడానికి మంగళవారం ప్రయత్నించారు. గొయ్యిలు తీసి సిమెంటు స్తంభాలను పాతి చుట్టూ ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నించగా, కామమ్మ కుమార్తెలు దేపల్లి రాజమ్మ, నందుపిల్లి సీతమ్మ అడ్డుకున్నారు. మా స్థలంలో కంచి వేయడానికి ఏమి హక్కు ఉన్నది, ఏమైనా పత్రాలు ఉంటే గ్రామ పెద్దలకు చూపించాలని కోరారు. పెళ్లిళ్లయి అత్తారింటికి వెళ్లిపోయిన మీరు ఇక్కడికి వచ్చి అడగడం ఏమిటంటూ ఎరుపల్లి లక్ష్మణరావు తో పాటు పార్వతి, తాతయ్య లక్ష్మమ్మ , అప్పమ్మ, తదితరులు దాడి చేశారు. ఈ దాడిలో దేపల్లి రాజమ్మ ను కొట్టి బలవంతంగా నెట్టడంతో ఫెన్సింగ్ కోసం తెచ్చిన సిమెంట్ స్తంభాలపై పడడంతో తలకు బలమైన గాయమై అపస్మారస్థితికి చేరుకుంది. గాయమైన రాజమ్మను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సంతబొమ్మాలి పోలీసులు తెలిపారు.

సభ్యత్వ నమోదులో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు

టీడీపీ నియోజకవర్గ సోషల్ మీడియా ఇంఛార్జ్ బగ్గు అర్చన

విశాలాంధ్ర - నరసన్నపేట : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, లోకేష్ ఆదేశాలు మేరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిడిపి సభ్యత్వ నమోదులో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నానని నియోజకవర్గ సోషల్ మీడియా ఇంఛార్జ్, బగ్గు అర్చన అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ప్రజాసదన్ క్లస్టర్-3 ఇంఛార్జ్, గొద్దు చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించిన బూత్‌ల పరిధిలో ఇంఛార్జ్‌లుతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న బగ్గు అర్చన మాట్లాడుతూ స్థానిక శాశనసభ్యులు, బగ్గు రమణమూర్తి పిలుపు మేరకు పట్టణం పరిధిలో టిడిపి సభ్యత్వ నమోదులో పెద్ద ఎత్తున పాల్గొని, విజయవంతం చేసిన మహిళా సోదరీమణులకు, పార్టీ యువతకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బూత్ ఇంఛార్జ్‌లకు పార్టీ సభ్యత్వ కార్డు బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, కళింగ కార్పొరేషన్ చైర్మన్, రోణంకి కృష్ణంనాయుడు, 20వ వార్డ్ మెంబర్, బతకల సంతోషి, టిడిపి నాయకులు, కింజరాపు రామారావు, బోయిన సతీష్, వూణ్ణ వేంకటేశ్వరరావు, రెడ్డి సతీష్, వూణ్ణ రాజశ్రీ, బలగ ప్రహర్షకుమార్, సరిపల్లి మధు, కోరాడ రామచంద్రరావు, గొలివి రామారావు, తాళాభక్తుల గోవిందరావు, బలగ భారతి, బోయిన ఆనందరావు, కింజరాపు చిన్నవాడు, బతకల గోపి, కోల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వారిని సాదరంగా స్వాగతం పలికిన ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర - హిరమండలం / పాతపట్నం : మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిరంకుశ వైఖరి తోపాటు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, స్థానికుడు, సమాన్యుడు, సేవా తత్పరుడైన ఎమ్మెల్యే ఎంజీఆర్ పనితీరుపై నమ్మకంతో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతు న్నట్లు కొత్తూరు మండల మాజీ వ్యవసాయ కమిటీ అధ్యక్షులు గోగుల వరప్రసాద్ నాయుడు తెలిపారు మంగళవారం విజయవాడలో పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు సమక్షంలో పారాపురం మాజీ ఎంపీటీసీ కుంచాల నూకరాజు, కొత్తూరు సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణరావు, పారాపురం సర్పంచ్ ప్రతినిధి కుంచాల తవిటి నాయుడు,వార్డు సభ్యులు నారాయణ రావు, కొమనాపల్లి హేమంత్ కుమార్, మూకాళ్ళ జనార్ధన,కొల్లి శంకరరావు తదితరులతో కలిసి పార్టీలో చేరారు,పార్టీలో చేరిన వారిని తెలుగుదేశం పార్టీ ఖండువాలతో సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే పాతపట్నం నియోజకవర్గానికి ముఖ్యంగా కొత్తూరు మండలంకు కీర్తిశేషులు గోగుల చల్లంనాయుడు చేసిన సేవలు ఎనలేనివని తన కుమారుడు సోదర సమానుడు వరప్రసాద్ నాయుడు టిడిపిలో చేరడం ఆనందంతో పాటు పార్టీ మరింత బలోపేతమైందని తెలిపారు కార్యక్రమంలో మాతల గాంధీ, అగతముడి మాధవరావు, అగతముడి అరుణ్ బాబు, టోంపల తిరుపతిరావు, చింతాడ కోటి తదితరులుచేరిన వారిలో ఉన్నారు.

వివిధ రాజకీయ పార్టీలతో డీఆర్ఓ వెంకటేశ్వరరావు సమావేశం

విశాలాంధ్ర - శ్రీకాకుళం : జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీలతో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశానుసారం జిల్లా ఎన్నికల అధికారి, ఎలక్ట్రోరల్ అధికారి స్థాయిలో ప్రతీ నెల నిర్వహించాల్సిన గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలుతో కలెక్టరేట్ లో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయి అధికారులు నియామకాలు, పోలింగ్ బూతులకు సంబంధించి అంశాలపై చర్చించి పోలింగు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు, తదితర వాటిపై సమీ క్షించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు చేసిన సూచనలు, సలహాలను ఆయన స్వీకరించారు. ఈ సమావేశంలో తెలుగు దేశం పార్టీ నుండి పి.యం.జె బాబు, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, వైఎస్ఆర్సిపి నుండి ఆర్. శంకరరావు, కాంగ్రెస్ పార్టీ నుండి కెఎల్ఎస్ కుమారి, బిఎస్పీ నుండి ఎల్.సోమేశ్వరరావు, సీపీఎం నుండి ఎం.గోవర్ధనరావు, బిఎస్పీ ఎస్. మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌బాబుతో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ ప్రత్యేక భేటీ

- నియోజకవర్గానికి చెందిన పలు అంశాల పై చర్చ

- ఎమ్మెల్యే ఎన్ఈఆర్ పనితీరు పై అభినందనలు తెలియజేసిన మంత్రి లోకేష్ బాబు

విశాలాంధ్ర - రణస్థలం : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు తో ప్రత్యేకంగా సమావేశమై నియోజక వర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ల ఏర్పాటు ఆవశ్యకత ను మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లారు. అదే విధంగా నియోజకవర్గంలో ఉన్న పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలు, అంబేద్కర్ యూనివర్సిటీ, ఐఐఐటీ వంటి విద్యాసంస్థలకు సంబంధించి, రైతులు సాగు నీటి కోసం పడుతున్న అవస్థలు వంటి పలు విషయాలపై కూలంకుశ చర్చ జరిగిందని, మంత్రి లోకేష్ బాబు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలియజేశారు. నియోజకవర్గ పర్యటనకు సంబంధించి త్వరలో షెడ్యూల్ ఖరారు చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం తెలుస్తుంది.

ఉత్తరాంధ్ర స్థాయి ఉగాది కవి సమ్మేళనానికి ఆహ్వానం

విశాలాంధ్ర - పలాస : ఉగాది సందర్భంగా పలాస కాశీబుగ్గ జన జాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యం లో లయన్స్ క్లబ్ సౌజన్యంతో పలాస లయన్స్ హాల్ లో ఈ నెల 30న ఉదయం 10 గంటల నుండి శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవం నిర్వహించ బడుతుందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తెప్పల కృష్ణమూర్తి, అధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శి బండారి కాళిదాసులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉగాది కార్యక్రమంలో ఉత్తరాంధ్ర స్థాయి కవి సమ్మేళనంతో పాటు పంచాంగ శ్రవణం, శాస్త్రీయ నృత్యంలు, భక్తి గేయాల ఆడియో విడుదల, ఆమని చివురు - కోయిల కబురు ' ప్రసంగం, లబ్ధ ప్రతిష్ఠులైన ఐదుగురు పద్య కవులకు ఆత్మీయ సత్కారం ఉంటుందని తెలిపారు. పాల్గొను కవులకు ఉగాది విందుతో పాటు... 'పుష్పం-ఫలం-కలం-దుశ్శాలువా, ప్రశంశ పత్రం జ్ఞాపికతో సన్మానం చేయబడుతుందని తెలిపారు.

నిబంధనలు : కవిత సామాజిక అంశమై ఉండాలి. రాజకీయ అంశంలకు, అనుచిత వ్యాఖ్యలకు తావు లేదు. స్వీయ కవితా పఠనం మాత్రమే.నాలుగు పద్యములు గాని, ఇరువది పంక్తులు వచన కవిత గాని ఈ నెల 25 తేదీ లోపల లయన్ డా తెప్పల కృష్ణ మూర్తి, పలాస, 9440334110 నంబర్ కు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. ఉపోద్ఘాతములకు అనుమతి లేదని. సమయం కేవలం నాలుగు నిమిషాలు మాత్రమేనని తెలిపారు. వ్రాత ప్రతులు అనుమతించ బడవని, తుది నిర్ణయం నిర్వాహకులదేనని, ఎటువంటి ప్రవేశ రుసుము లేదని తెలిపారు.

అనుమతులకు వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచరాదు

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : అనుమతులకు వచ్చే ధరఖాస్తులను పెండింగ్‌లో ఉంచరాదని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కార్యాలయ సమావేశ మందిరంలో పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహం పై సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన జూంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విండోకు సంబంధించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయని జిఎంను అడుగగా 15 ధరఖాస్తులు రాగా 13 ప్రోసెస్ లో ఉన్నట్లు జిఎం విజయరత్నం చెప్పారు. పిఎంఇజిపిలో 69 లక్ష్యం కాగా 90 మంజూరు చేయడమైనదని ఇందుకు 4.39 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు జిఎం తెలిపారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ పురోగతి పై కలెక్టర్ ఆరా తీయగా 6599 మంజూరు చేయగా ఇందులో 5884 మందికి శిక్షణ పూర్తి చేయడమైని వీరిలో 1037 మందికి బ్యాంకు నుండి 10.37 కోట్ల రూపాయలను రుణంగా మంజూరు చేసినట్లు జిఎం విజయరత్నం వివరించారు. ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీలో 54 యూనిట్లకు 2.12 కోట్ల రూపాయలను పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ మంజూరు చేశారు. ఎపిఐఐసి వద్ద ఉన్న భూమిని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ సర్వే పరిస్థితి పై కలెక్టర్ అడుగగా ఎంఎస్ఎంఈ సర్వేలో 66910 విద్యుత్ సర్వీసు కనెక్షన్లు గుర్తించి సర్వే పూర్తి చేసినట్లు కలెక్టర్ కు జిఎం వివరించారు. రణస్థలం మండలంలో అటవీ భూములపై డిఎఫ్ఓ వెంకటేష్, శ్రీకాకుళం ఆర్డీఓలతో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కె. విజయరత్నం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణ శ్రీ, ఎపిఐఐసి జడ్ఎం ఎం.మురళీ మోహనరావు, అగ్నిమాపక శాఖ అధికారి మోహనరావు, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.రాంబాబు, ఎడి రఘునాథ్, ప్రోత్సాహక అధికారులు డి.రవికుమార్, ఎ.కిరణ్ కుమార్ ఎల్డీయం సూర్యకిరణ్, ఎపిఎంఐపి డిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

విశాలాంధ్ర - ఆమదాలవలస : మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఆమదాలవలస పోలీస్ శాఖ ప్రతినిధి గోవిందరావు అన్నారు. సంకల్పం పేరుతో మాదక ద్రవ్యాలకు బాని సలు కావద్దు, మీ జీవితాన్ని బలి చేసుకోవద్దు అనే నినాదంతో మంగళ వారం శ్రీ వెంకటేశ్వర పారిశ్రామిక శిక్షణా సంస్థలు విద్యార్థులతో మాట్లాడుతూ మత్తు పదార్థాలు భవిష్యత్తును చిత్తు చేస్తాయని వివరించారు. గంజాయి కొకైన్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపు రాదని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణకు ఇష్టమైన చర్యలు చేపడుతున్నామని రమణమూర్తి ముత్యాలరావు వివరించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని అందుకు యువత సహకరించాలని ఆ సంస్థ డైరెక్టర్ కూన భానుజీరావు తెలిపారు. మీ పరిసర ప్రాంతాల్లో ఇటువంటి మత్తు కు బానిసైన వారు ఉంటే వెంటనే తెలియజేయాలని వారికి కౌన్సెలింగ్ ద్వారా నియంత్రణ చేయనున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డివి ప్రసాద్, పైడి సంతోష్ కుమార్, శ్రీనివాసరావు, సుమంత, ఉరిటి కృష్ణంరాజు విద్యార్థులు పాల్గొని డ్రగ్స్ నియంత్రణపై నినాదాలు చేశారు.

మరెన్నో పుస్తకాలు రచించాలి

విశాలాంధ్ర - టెక్కలి : విద్యార్థులకు ఉపయోగపడే మరెన్నో పుస్తకాలు రచించాలని డైరెక్టర్ ప్రొఫెసర్ వివి.నాగేశ్వరరావు అన్నారు. మండలంలో ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్అండ్ హెచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డీన్ డాక్టర్ ఆర్. శాంతి కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అగతమూడి లక్ష్మణరావు లు నూతనంగా రచించిన స్టాటిస్టికల్ మెథడ్స్ ఫర్ ఇంజినీర్స్ అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు మంగళవారం తన ఛాంబర్లో ఆవిష్కరించారు. కంప్యూటర్ సైన్స్ అనుసందానంగా ఉన్న అన్ని బిటెక్ కోర్సుల విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగ పడుతుందని డైరెక్టర్ పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆరెన్డీ డీన్ డాక్టర్ డి.శ్రీరాములు, హెచ్డిలు డాక్టర్ రత్నమణి, డాక్టర్ మల్లా రమణయ్యలు పాల్గొని రచయితలకు అభినందించి మరిన్ని మంచి పుస్తకాలు వ్రాయాలని కోరారు. ఐతమ్ బోధన,బోధనేతర సిబ్బంది రచయితలు డాక్టర్ ఆర్.శాంతికుమార్, డాక్టర్ ఎ. లక్ష్మణరావులకు అభినందించారు.

ఏప్రిల్ 13న ఆపోటా మేధా సమ్మాన్ ప్రతిభ పరీక్ష

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని సహోలాల పుట్టుగ జిల్లా పరిషత్ ఒరియా ఉన్నత పాఠశాలలో ఆపోటా కవిటి మండల శాఖ అధ్యక్షుడు కేశవ పురియా అధ్యక్షతన మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీలో ఒడియా విద్య పరమైన సమస్యలు పై సమగ్రంగా చర్చించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఇచ్ఛాపురం నియోజకవర్గం శాసనసభ సభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ కు ఒడియా ప్రజలు మరియు ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఒడియా ప్రజల పై ఎమ్మెల్యే ప్రేమ మమకారం వేలకట్టలేనిదని కొనియాడారు. ప్రతి సంవత్సరం జరుగుతున్న ఆపోటా జిల్లా స్థాయి మేధా సమ్మాన్ ప్రతిభ పరీక్ష ఏప్రిల్ 13న జరపబడునని తెలిపారు. ప్రతి పాఠశాల నుండి ఐదుగురు 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల పేర్లు ఈ నెల 25 వ తేది లోగ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పరీక్ష రోజు పిల్లలకు వసతి, త్రాగునీరు, మజ్జిగ, భోజనం సౌకర్యాలు కల్పించాలని, పరీక్షలు సజావుగా జరిగేటట్లు చూడా లని మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులకు సూచించారు. ఈ సందర్భంగా ఆపోటా మండల శాఖ అధ్యక్షుడు కేశవ పురియా మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 13న జరిగే జిల్లా స్థాయి మేధా సమ్మాన్ ప్రతిభ పరీక్ష సహోలాలపుట్టుగ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తమని,ఆరోజు మండలంలో పని చేస్తున్న ఒడియా ఉపాధ్యాయులు తమ పాఠశాల నుండి పరీక్షకు హాజరయ్యే పిల్లలతో ఉదయం ఎనిమిది గంటలకు హాజరు కావలని, పరీక్ష కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యా యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మనోజ్ కుమార్ మహారణ, సంయుక్త కార్యదర్శి త్రిలోచన పొల్లాయి, ప్రమోద్ కుమార్ పాఢీ, బి. దేవదాసు, కిరణ్ కుమార్, తులస ప్రధాన్, గిరిధర్ ప్రధాన్, శ్రీధర సామంత్, సుమంత్ పాఢీ, జి.విజయ కుమార్, లింగరాజ్ బెహెరా పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆమదాల వలస నియోజకవర్గ పరిధిలోని పలువు రు వివిధ వ్యాధుల బారిన పడి, ప్రమాదాల్లోగా యపడి, అనారోగ్యంతో బాధపడిన వారికి ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే పియుసి చైర్మన్ కూన రవికుమార్ మంజూరయ్యేలా కృషి చేశారు. మాజీ ఎంపీపీ రవికుమార్ సతీమణి కూన ప్రమీల ఆధ్వర్యంలో మంగళవారం బాధిత కుటుంబాలకు చెక్కులను అందించారు. బూర్జి మండలం ఉప్ప పేటకు చెందిన బొల్లు సూరిబాబు కుటుంబానికి 92000 చెక్కును కూన ప్రమీల మరియు మార్కెట్ ఏపీ స్టేట్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో అందించారు. దానివలస పురపాలక సంఘం పరిధి కే మన్నయపేటకు చెందిన పేడాడ శిరీష కుటుంబానికి 25 వేల రూపాయలు చెక్కును స్థానిక నాయకుల ఆధ్వర్యంలో అందించారు. ఎస్ఎస్సి పేట కు చెందిన లక్ష్మి కుటుంబానికి సర్పంచ్ గౌరీపతి ఆధ్వర్యంలో 70000 చెక్ అందించారు. బాధితులను ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ఎమ్మెల్యే రవికుమార్ కు ఆయా కుటుంబాలు అభినంద నలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు సర్పంచ్ సూరపు నాయుడు తెలుగుదేశం పేట నాయకులు పాల్గొన్నారు.

బస్సు కోసం ఇక్కట్లు పడుతున్న ఐతమ్ విద్యార్థులు

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల బస్ స్టాప్ సమీపంలో కళాశాల సమయాలలో ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రతి రోజు లాగే మంగళవారం సాయంత్రం 4బీ00 గంటల సమయంలో బస్ స్టాప్ వద్ద బస్ కోసం విద్యార్థులు పడిగాపులు కాస్తూ ఉన్నారు. అయితే కొంత సమయం తర్వాత ఒక పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు రావడంతో బస్సులోకి ఎక్కేందుకు విద్యార్థులు తొక్కిసిలాడే ప్రయత్నం చేశారు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు విద్యార్థుల ఇబ్బందులను చూసి భయాందోళన చెందారు. కళాశాల యాజ మాన్యమైన, ఉన్నతాధికారులైన దీనిపై స్పందించి కళాశాల ప్రారంభం, విడిచి పెట్టే సమయాలలో విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని స్థానిక ప్రయాణికులు కోరుకుంటున్నారు.

బార్ అధ్యక్ష స్థానానికి మూడు నామినేషన్లు

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావ డంతో నామినేషన్ల పర్వం ముగిసేనాటికి మూడు నామినేషన్లు ఉన్నాయి. ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి భాయ్, పైడి వరాహ నరసింహులు, అన్నెపు సత్యనారాయణ, అధ్యక్ష స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన వారు ఉన్నారు. 19వ తేదీ బుధ వారం స్క్రూట్నీ, గురువారం నామి నేషన్ ఉపసంహరణ ఉంది. బార్ ఎన్నికలు సహృ ద్భావ వాతావరణం లో జరిగే విధంగా సీనియర్ నాయకులు మంతనాలు జరుపుతున్నారు. ఎన్నిక ఏకగ్రీవం అయ్యే విధంగా చర్యలు చేపడు తున్నారు. ఈ ప్రయత్నాలు విఫలమైతే ఈనెల 27వ తేదీన బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగనున్నాయి.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలి

విశాలాంధ్ర - టెక్కలి : నాయీ బ్రాహ్మణ సమస్యలు పరిష్కారానికి ఐక్యతగా కృషి చేయాలని సంఘ నాయకులు అన్నారు. ఈ సంద ర్భంగా మండలంలో స్థానిక జగతిమెట్ట లో నాయీ బ్రాహ్మణ సంఘ సమావేశం నిర్వ హిం చారు. సంఘ సమస్యలపై సమావేశంలో చర్చించు కున్నారు. భవిష్యత్తు కార్యాచరణ, కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా సంఘ పెద్దలు దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తామని సంఘ సభ్యులకు తెలిపారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు కే.రామారావు, ఎస్ వెంకట్రావు, వీరాస్వామి, చిన్నారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలు, రెల్లిలకి అన్యాయం

- సమగ్ర కులగణన లేకుండా వర్గీకరణ ఎలా చేస్తారు
- కులగణన నిర్వహించిన తర్వాతనే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్
- ప్రభుత్వం పునరాలోచన చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకి సిద్ధం
- మీడియా సమావేశంలో మాట్లాడిన నాయకులు డా.కంఠ వేణు, తైక్వాండో శ్రీను, అర్జి కోటిలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ఎస్సీ వర్గీకరణ కారణంగా రాష్ట్రంలో ఉండే మాలలకి, రెల్లిలకు వాటి అనుబంధ కులాలకి అన్యాయం జరుగుతుందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డా. కంఠ వేణు, తైక్వాండో శ్రీను, రెల్లి కుల సంక్షేమ సంఘం నాయకులు అర్జి కోటిలు ఆవేదనను వ్యక్తం చేసారు. రాష్ట్రం యూనిట్ గా ఎస్.సి వర్గీకరణకి ఎన్ డిఏ కూటమి సిద్ధపడడాన్ని వారు తప్పుపట్టారు. సమగ్ర కులగణన లేకుండా ఎస్.సిలను ఎలా వర్గీకరిస్తారంటూ ధ్వజమెత్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రం యూనిట్ గా తీసుకుని వర్గీకరణను అమలు చేసేందుకు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్ డిఏ కూటమి ప్రభుత్వం సిద్ధపడటం దారుణమని మండిపడ్డారు. శ్రీకాకుళంలోని ఎన్ జీఓ హెూంలో మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డా. కంఠ వేణు, తైక్వాండో శ్రీను, రెల్లి కుల సంక్షేమ సంఘం నాయకులు అర్జి కోటిలు మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో నిర్వహించిన 2011 జనాభా లెక్కల ప్రకారం నూతన ఆంధ్రప్రదేశ్ లో ఎస్సీ వర్గీకరణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తున్నా మన్నారు. 2025 నాటికి ఆంధ్రప్రదేశ్ లో మాలలు, రెల్లిలు వాటి అనుబంధ కులాల జనాభా ఎంతగానో పెరిగిందని ఆ లెక్కలను పరిగణలోకి తీసుకోకుండా 14 యేళ్ళ క్రితం నాటి(2011) జనాభా లెక్కలను ఎన్ డిఏ కూటమి ప్రభుత్వం ఎలా పరిగణలోకి తీసుకుంటుందని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణకి సంబందించి సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పులో ఎంపరికల్ డేటాను పరిగణలోకి తీసుకోవాలని చెప్పిందని,కూటమి ప్రభుత్వం ఆ డేటాని పరిగణలోకి తీసుకోలేదని ఆరోపించారు. ఎంపరికల్ డేటాకి బదులుగా 2011 జనాభా లెక్కలు పరిగణలోకి తీసుకోవడం సరికాదన్నారు. ఎస్.సి వర్గీకరణకి సంబంధించి మెజార్టీ దళిత ఎమ్మెల్యేలు జిల్లా యూనిట్ గా వర్గీకరణ చేయాలని కోరుతున్నా రాష్ట్ర యూనిట్ గా చేసేందుకు కూటమి ప్రభుత్వం ఉత్సాహాన్ని చూపిస్తుండడం మాదిగలకి లబ్ధి చేకూర్చేందుకేనని వారు ఆరోపించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తీసుకుని మాల సామాజిక వర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేల అభిప్రాయాలను మాటలను ప్రభుత్వ పెద్దలు లెక్క చేయకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన మాదిగలకి లబ్ధి చేకూర్చేందుకే రాష్ట్రం యూనిట్‌గా ఎస్.సి వర్గీకరణ చేయాలని ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తున్నట్లుగా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయని వారు పేర్కొన్నారు. రాజీవ్ రంజన్ మిశ్రా నివేదకపై ఈ నెల 20న అసెంబ్లీలో చర్చించనున్న నేపధ్యంలో సమగ్ర కులగణన నిర్వహించిన తర్వాతనే ఎస్.సి వర్గీకరణపై నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేసారు. మాలలు, రెల్లిలు, వాటి అనుబంధ ఉపకులాల వారికి అన్యాయం జరిగితే ఆ సామాజిక వర్గాల ఆగ్రహానికి కూటమి గురికాక తప్పదని వారు హెచ్చరించారు. ఎస్.సి వర్గీకరణ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. లేనిపక్షంలో మేధావులతో చర్చించి వర్గీకరణపై న్యాయం పోరాటం చేసేందుకు రెడీగా ఉన్నామని డా.కంఠ వేణు, తైక్వాండో శ్రీను,అర్జి కోటిలు తెలియజేసారు. ఈ మీడియా సమావేశంలో ఎస్.సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు యజ్జల గురుమూర్తి, సింకి రమణ, పెయ్యల చంటి, ఎస్. సూర్యనారాయణ, అబ్బాస్, అర్జి ఈశ్వరరావు, దూళి మోహన్, తిరుపతిరావు, రామ్మోహన్ రావు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఓటర్ జాబితాపై పార్టీ నాయకులతో సమీక్ష

విశాలాంధ్ర - టెక్కలి : మండల కేంద్రంలో స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో ఎం కృష్ణమూర్తి ఓటర్ జాబితాపై వివిధ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు వివిధ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించినట్లు ఆర్డీవో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ ఎస్ ఆర్ 2025 ఎన్నికలు నిమిత్తం ఓటర్ల జాబితాలో ఏమైనా మార్పులు గాని, చేర్పులు గాని, సవరణ గాని ఉంటే తమ అభ్యంతరాలు చెప్పాలని సూచించారు. అలాగే ఫారం 6,7,8 సంబంధించి వివరించారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందవచ్చని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలని వివిధ పార్టీ నాయకులకు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వంగడాలతో రైతులకు ప్రయోజనం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నూతన వంగడాలను కనుక్కోవాలనివ్యవసాయ విద్యార్థులకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం డీన్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాస్ అన్నారు. మండలం ఎస్ఎస్ఆర్పురంలోని శ్రీ కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయార చేసిన వ్యవసాయ క్షేత్రాలను, అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించారు. ఈ కళాశాలకు ఐకార్ గుర్తింపు లభించడంతో విద్యార్థులకు మరింత మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నైర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. భరతలక్ష్మి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోష్, మేనేజ్మెంటు ప్రతినిధులు ఇప్పిలి కిశోర్, దుర్గాశ్రీనివాస్ తదితర లు పాల్గొన్నారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసిన ప్రధానోపాధ్యాయుడు లయన్.డా. మిశ్రో

విశాలాంధ్ర - ఎల్ఎన్ పేట : లక్ష్మి నర్సు పేట ప్రాథమిక పాఠశాల నందు విద్యార్థి - విద్యార్థినీల కు వేసవి తీవ్రత దృష్ట్యా ప్రధానో పాధ్యాయుడు సామాజిక వేత్తబీలయన్స్ క్లబ్ సర్వీస్ ఛైర్పర్సన్బీదివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు సక్షం జిల్లా కన్వీనర్ ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డు గ్రహీత లయన్. డా.ఎం.కె.మిశ్రో స్వంత నిధులతో గత 5 సంవత్సరాల నుండి పాఠశాల సింగిల్ సెక్షన్ పనిచేయు రోజుల యందు ఇచ్చే విధంగా ఈ సంవత్సరం కూడా మజ్జిగ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయులు టి.ఉపేంద్ర వి.ఆర్.ఓ. రమణమ్మ వి.ఆర్.ఎ. అప్పలరాజు మరియు విద్యార్థి -విద్యా ర్థినీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.ఆర్.ఓ. రమణమ్మ మాట్లాడుతూ డా.మిశ్రో చేస్తూన్న సేవా కార్యక్రమాలును ప్రశంసించారు.

అంగన్వాడీ కేంద్రాలు ఉ. 8 నుండి 12 గంటల వరకు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటా యని మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు బి.శాంతిశ్రీ మంగళవారం తెలిపారు. వేసవి దృష్ట్యా మార్చి నెల 18వ తేదీ నుండి మే నెల 31వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాలు సమయం మార్చినట్లు పేర్కొన్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు వేడి ఆహారం ఇచ్చి పిల్లలను వారి వారి గృహాలకు పంపాలని ఆమె తెలిపారు.

స్వయం ఉపాధికి దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - కొత్తూరు : స్వయం ఉపాధికి బీసీ, ఓబీసీ , అగ్రకులాల పేద వర్గాల నుం డి దరకాస్తులు స్తున్నట్లు ఎంపిడిఓ నీరజ ఒకప్రకటనలో కోరారు బి.ఫారం చేసిన.నిరుద్యోగులు కు జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటుకు, 50 ఏళ్లు దాటిన ఈబీసీ వర్గాలు వారు స్వయం ఉపాధి కి దరకాస్తులు ఇవ్వాలని ఎంపిడివో నీరజ కోరారు రేషన్ కార్డు ఆధార్ కార్డు ,కుల, ఆదాయ, పాన్. ఫోటోలుతో తమ దరఖాస్తులు ఇవ్వాలనీ ఎంపిడిఓ నీరజ కోరారుమొత్తం 48 యూనిట్లు. మంజూరు అయినాయని తెలిపారు.

జాడుపూడిలో జేబీ రోడ్డు వేయాలని వినతి

విశాలాంధ్ర - కవిటి : కవిటి మండలం జాడుపూడి ఆర్ఎస్ బ్రిడ్జీ నుండి రైల్వే స్టేషన్ వరకు పాడైన జేబీ రోడ్డును మరామత్తులు చేయాలని కవిటి మండల టీడీపీ నాయకులు మంగళవారం అమరావతిలో ఉన్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు మరామత్తులకు రూ. 80 లక్షలు ఖర్చు అవుతుందని అంచనాలు వేసి మంత్రిగారికి ఇవ్వడం జరిగిందని తర్వలోని ఆ రోడ్డు మరామత్తులు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మణిచంద్ర ప్రకాష్, ఎంపీటీసీ ప్రతినిధి సంతోష్ కుమార్ పట్నాయక్, భీమారావ్‌లో, బాసుదేవ్ రావ్‌లో, సోంపేట టిడిపి మాజీ జెడ్పిటిసి సభ్యులు సూరాడ చంద్రమోహన్ పాల్గొన్నారు.

కట్టుకున్న భర్తే కాలయముడయ్యాడు

అనుమానంతోనే భార్యను హతమార్చిన భర్త

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మూడు ముళ్ల బంధాన్ని, ఏడుడగుల అనుబంధాన్ని మరిచిన ఆ వ్యక్తి భార్యను నిర్దాక్షిణ్యంగా హత్యచేశాడు. తాగిన మైకంలో విచక్షణ కోల్పోయి కిరాతకుడిగా వ్యవహరించాడు. గ్రామంలో అంతా నిద్రలోకి జారుకున్న సమయంలో భార్యను ఇం టిలోనే కడతేర్చాడు ఆ ప్రబుద్ధుడు. ఈ సంఘటన ఎచ్చెర్ల మండలం సంతశీతారంపురం గ్రామంలో జరగగా, భర్త చేతిలో నాగమ్మ (42) హతమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఎచ్చెర్ల మండలం సంతశీతారాంపురం గ్రామానికి చెందిన గాలి నాగమ్మ, అప్పలరెడ్డిలు భార్యాభర్తలు. ఈ దంపతులకు ఇద్దరు సంతానం. ఇందులో కుమారుడు త్రినాథ్ విశాఖపట్నంలో తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుమార్తె పార్వతికి 2020లోనే వివాహం జరగగా, ఈమె భర తో కలిసి విశాఖపట్నంలోనే ఉంటోంది. ప్రస్తుతం భార్యాభర్తలైన నాగమ్మ, అప్పలరెడ్డిలు ఇద్దరు మాత్రమే స్వగ్రామమైన సం తశీతారాంపురంలో ఉంటున్నారు. నీలగిరి, సరుగుడు తదితర తోటలు కొడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న అప్పలరెడ్డికి మద్యం సేవించే అలవాటు ఉంది. నిరంతరం భార్యను అనుమానిస్తూ, అవమానిస్తున్నాడు. ఇదే క్రమంలో సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఇంట్లో టీవీ చూస్తున్న నాగమ్మతో గొడవ పడ్డాడు. అంతటితో ఆగకుండా తోటలు కొట్టేందుకు వి నియోగించే కత్తితో ఆమె తలపై, నుదుటిపై, మెడపై, బుగ్గలపై బలంగా దాడిచేయగా ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. అరు తే సుమారు 20 ఏళ్ల క్రితం నాగమ్మను అప్పలరెడ్డి ప్రేమించి పెళ్లిచేసుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. భార్యను హతమార్చిన భర్త అప్పలరెడ్డిని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. జేఆర్పురం సీఐ ఎం. అవతారం, ఎస్ఐ వి.సందీపక మార్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీమ్ వివరాలు సేకరించింది. శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కుమారుడు త్రినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు నమోదు చేసి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.